# Eenadu

# 2011 గ్రూప్-1కు తగ్గిన పోటీ

**• తెలంగాణలో పునః పరీక్షకు భారీగా గైర్హాజరీ**

**ఈనాడు, హైదరాబాద్:** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 2011 గ్రూప్-1 మెయిన్స్ పునః పరీక్షకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో అభ్యర్థులు భారీగా గైర్హాజరయ్యారు. మొత్తం 8782 మందికి టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేయగా 8760 మందికి ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. కానీ తెలంగాణలో కేవలం 1869 మంది; ఏపీలో 3100 వరకు మాత్రమే బుధవారంనాటి జనరల్ ఎస్సే పేపర్-1కు హాజరయ్యారు. 2011 నాటి ఈ పరీక్ష అనేక వివాదాల్లో చిక్కుకొని సుప్రీంకోర్టుకు కూడా చేరుకొని ఇప్పుడు మళ్లీ జరుగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లో విడివిడిగా ఇప్పుడు పరీక్ష నిర్వహిస్తున్నారు. అప్పుడు రాసినవారిలో చాలా మంది వేరే ఉద్యోగాల్లో చేరిపోవటంతో పాటు రాష్ట్ర విభజన, ఒకేసారి రెండు రాష్ట్రాల్లో పరీక్ష జరపటం కూడా హాజరీ తగ్గటానికి కారణమని భావిస్తున్నారు. మొత్తం మీద తెలంగాణలో 140 పోస్టులకుగాను 1869 మంది పోటీపడుతున్నట్లైంది. అంటే ఒక్కో పోస్టుకు 20 మంది కూడా పోటీపడటం లేదు. "గతంలో ఎప్పుడు గ్రూప్-1 జరిగినా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులు పోటీపడేవారు. కానీ ఈసారి అతి తక్కువగా ఉన్నారు. ఇది భలే మంచి అవకాశం!" అని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

**వారికి కొత్త హాల్‌టికెట్లు:** హైదరాబాద్‌లో మొత్తం 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా కేవలం నాలుగింటిలో మాత్రమే హాజరీ రెండంకెల సంఖ్యను దాటింది. దీంతో రెండంకెల హాజరీ నమోదైన పరీక్ష కేంద్రాల్లోని 152 మంది అభ్యర్థులందరినీ మిగిలిన పేపర్లకు ఒకే కేంద్రంలోకి (భారతీయ విద్యాభవన్, కింగ్‌కోటి) మారుస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పార్వతి సుబ్రమణ్యన్ తెలిపారు. ఈ అభ్యర్థులంతా 17, 19, 21, 23, 24 తేదీల్లో జరిగే మిగిలిన పేపర్లను (పేపర్-2, 3, 4, జనరల్ ఇంగ్లిష్) మార్చిన కేంద్రంలో రాయాల్సి ఉంటుంది. 152 మంది తమ కొత్త హాల్‌టికెట్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు